క్లుప్తంగా

వయోజన విద్యను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుందరరామయ్య

దర్శి: ప్రతిఒక్కరూ వయోజన విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ కే సుందరరామయ్య అన్నారు. వయోజన విద్యపై బుధవారం ఉల్లాస్ ట్రైనింగ్ ప్రోగాం నిర్వహించారు. ఎంపీడీఓ సుందరరామయ్య మాట్లాడుతూ మొదటి విడతగా మండలంలోని బెల్లంకొండవారిపాలెం, తూర్పు గంగవరం, రామభద్రాపురం, నాగంబొట్లపాలెం, మల్కాపురం గ్రామాలకు చెందిన 662 మందిని గుర్తించినట్లు తెలిపారు. పది మంది చొప్పున ఒకరిని వలంటరీ టీచర్‌గా ఎంపిక చేసి చదువు చెప్పించనున్నట్లు తెలిపారు. ఎంఈఓ జీ సుబ్బయ్య, ఏపీఎం దేవరాజు, వయోజన విద్య సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, సీసీలు మోహనరావు, సుచేంద్ర, వీఓఏలు, వలంటరీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి

కురిచేడు: ప్రస్తుత వాతావరణంలో కంది, పత్తి పంటలను ఆశించిన పురుగులు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పీ మధుబాబు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పడమర గంగవరం, అలవలపాడు గ్రామాల్లో సాగుచేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు తెగుళ్లు, పురుగుల నివారణకు వాడాల్సిన మందుల వివరాలు, వాటి మోతాదు, తదితర విషయాలను వివరించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, వాటి వలన కలిగే ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చీడపీడలపై అవగాహన కలిగి ఉండాలి



అధికారులను సత్కరిస్తున్న దుకాణదారులు

దర్శి: దుకాణదారులు చీడపీడలపై అవగాహన కలిగి ఉండాలని క్రిమిసైట్స్ ప్రొటెక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక గణేష్ ఫంక్షన్ హాల్‌లో ఎరువుల దుకాణదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ బండి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించి దుకాణదారులకు చీడపీడల నిర్మూలనపై సలహాలు, సూచనలు అందించారు. అధికారులను దుకాణదారులు సత్కరించారు. జోనల్ మేనేజర్ ఓబయ్య, డీఎం ప్రశాంత్‌రెడ్డి, ఎస్ఓ హరీష్, జిల్లాలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ శ్రీనివాసరావు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని శంకరాపురం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 15 ఆఫీసర్ చాయిస్ బ్రాండ్ మద్యం బాటిళ్లను దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు బుధవారం పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వాటిని యండ్లూరి మనోజ్‌కుమార్ అనే వ్యక్తి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పీసీలు శ్రీనివాసులు, శ్రీనివాసరావు, నాగరాజు, ఖాశింపీరా పాల్గొన్నారు.

అపార్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

- డిప్యూటీ డీఈవో శామ్యూల్‌జాన్



జెడ్పీ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈవో శామ్యూల్‌జాన్

పుల్లలచెరువు: పాఠశాలల్లో అపార్ నమోదు ప్రక్రియను సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ డీఈవో శామ్యూల్‌జాన్ ఆదేశించారు. మండలంలోని పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న అపార్ ప్రక్రియను బుధవారం తనిఖీ చేశారు. డిప్యూటీ డీఈవో శామ్యూల్‌జాన్ మాట్లాడుతూ తొలి విడతగా 9, 10 తరగతులకు అపార్ ఐడీని రూపొందించే పనిని ప్రారంభించారని, మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లుగా తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు.

ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు

- అర్ధంతరంగా నిలిచిన సచివాలయ భవనాలు
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు



గొబ్బూరులో చిల్లకంప మధ్యలో పూర్తైన సచివాలయ భవనం



దేవరాజుగట్టు గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనం

పెద్దారవీడు:

గ్రామ సచివాలయాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోవడం, పూర్తయిన భవనాలు ప్రారంభించకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పరిపాలన ప్రజల వద్దకు తీసుకురావాలనే ఆశయంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వివిధ పనుల కోసం ప్రజలు వ్యయ ప్రయాసల కోర్చి మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్యాలయ భవనాలు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్మించారు. మండలాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణం చేపట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను తెచ్చి ఒక్కో సచివాలయంలో 11 శాఖల ఉద్యోగులను నియమించారు. నిర్మాణాలు పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో నిర్మాణాలు పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. చట్లమిట్ల, గొబ్బూరు గ్రామాల్లో నిర్మాణం పూర్తయినా భవనాలు ప్రారంభించకపోవటంతో వీటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు పెట్టి సచివాలయాలు నిర్మించినా నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యాలయాలు ప్రారంభించేందుకు ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. తోకపల్లి, కంభంపాడు, తంగిరాలపల్లి, సానికవరం, దేవరాజుగట్టు గ్రామాల్లో సచివాలయాల భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటి నిర్మాణాలు పూర్తిచేసే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం ఉన్న అద్దె భవనాలు, పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ రికార్డులతో పాటు ముఖ్యమైన వార్షిక సమావేశాలు, వార్డు సభ్యుల సమావేశాలు కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొందని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోకపల్లి, తంగిరాలపల్లి గ్రామాల్లో అద్దె భవనాలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు చెల్లిస్తున్నారు. పంచాయతీ అధికారులు ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రజలకూ అవస్థలు తప్పడంలేదు. కూటమి ప్రభుత్వ పాలనలో సచివాలయాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రజలకు ఉపయోగపడే భవన నిర్మాణాలపై కూటమి ప్రభుత్వానికి పక్షపాతం తగదని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు, కూటమి పాలకులు స్పందించి నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయాలు ప్రారంభించి, అసంపూర్తిగా నిలిచిన భవనాలు పూర్తి చేసి ప్రారంభించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సచివాలయం వినియోగించుకోవటం లేదు



మా గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సచివాలయం భవన నిర్మాణం పూర్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ రావటంతో అప్పట్లో ప్రారంభోత్సవాన్ని ఆపేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజకీయ దురుద్దేశంతో సచివాలయ భవనాన్ని వినియోగించటం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనం చిల్లకంపతో వృథాగా ఉంది. ఇరుకుగా ఉన్న పాత పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించలేక సిబ్బంది చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– అంగిరేకుల ఆదినారాయణ, సర్పంచ్
గొబ్బూరు గ్రామం

కొమ్మవరం చెరువుకు వేలం పాట

ముండ్లమూరు (దర్శి): మండలంలోని కొమ్మవరం చెరువుకు బుధవారం వేలం పాట నిర్వహించగా, రూ.15.60 లక్షలకు ఈదర గ్రామానికి చెందిన బోరెడ్డి వెంకటనారాయణరెడ్డి దక్కించుకున్నారు. ఈదర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఆ గ్రామ సర్పంచ్ వంగల పద్మావతి అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. డీఎల్‌పీఓ ఆర్.పద్మావతి మాట్లాడుతూ గ్రామ సర్వేనంబర్ 78, 80, 81లో 82 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.15.50 లక్షలు కాగా, వేలం పాటలో ఐదుగురు డిపాజిట్‌లు కట్టారన్నారు. 2024–25 నుంచి 2026–27 వరకు మూడు సంవత్సరాల పాటు బోరెడ్డి వెంకటనారాయణరెడ్డికి చెరువు అప్పజెబుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శి జే శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి శివనాగాంజలి, గ్రామస్తులు వంగల శ్రీనివాసరెడ్డి, ఇరుగుల కొండారెడ్డి, అబ్బుని అంజిరెడ్డి, తోట రామారావు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

వరి కంకిపోసే దశలో జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి



త్రిపురాంతకం మేడపిలో రైతులకు సూచలిస్తున్న వ్యవసాయాధికారి

పుల్లలచెరువు: మండలంలోని కొన్ని గ్రామాల్లో ముందుగా వేసిన వరి పంట కంకి దశలో ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని ఏవో నిర్మలాదేవి అన్నారు. మండలంలోని తెల్లగట్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఈ గ్రామంలో వేసిన వరి పంట కంకి దశలో ఉందని, ఎకరాకు 25 కేజీల యూరియా, 15 కేజీ పొటాష్ వాడితే పంట నాణ్యతగా వచ్చి దిగుబడి పెరుగుతుందని అన్నారు. అక్కడక్కడా అగ్గి తెగులు ఉన్నందున దాని నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సూచనలు తీసుకుని పంటలకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, కొండానాయక్ లతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఎగువ చర్లోపల్లి, చిలకచర్లలో పొలం పిలుస్తోంది

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి జవహర్ లాల్ నాయక్ బుధవారం మండల పరిధిలోని ఎగువ చర్లోపల్లి, చిలకచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించి మిర్చి, పత్తి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా మిర్చి పంటలో కొమ్ము ఎండు తెగులును గుర్తించారు. ఈ తెగులు నివారణకు కెప్టన్, హెక్సా కొనజోల్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ చైతన్యకుమార్, వీఎస్ఏ షెడ్రక్ బాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా మందులు వాడొద్దు

పెద్దారవీడు: పంటలకు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడకుండా అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని వ్యవసాయాధికారి కే బుజ్జిబాయి అన్నారు. మండలంలో బద్వీడు చెర్లోపల్లి, ప్రగళ్లపాడు, బద్వీడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి, కంది పంటలను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

వరికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ పరిధిలో వేసిన వరి పంటకు తెగుళ్లు, పురుగు పడుతున్నందున తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కే నీరజ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం మేడపిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటను పరిశీలించిన అనంతరం రైతులకు వరిపంటకు ఆకుచుట్టు పురుగు వస్తుందని దీనికి తగిన మందులు పిచికారి చేయాలన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

దర్శి: సబ్సిడీ ద్వారా అందజేస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ బాలకృష్ణ నాయక్ రైతులను కోరారు. మండలంలోని శామంతపూడి, దర్శి–2 సచివాలయాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ శనగ విత్తనాలు క్వింటా పూర్తి ధర రూ.9,400 కాగా, సబ్సిడీలో రూ.7,050కి అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు రబీ పంట ఇన్సూరెన్స్‌లు డిసెంబర్ 15లోగా చెల్లించుకోవాలన్నారు. ప్రస్తుతం వరి పంటను ఉల్లి కోడు ఆశిస్తోందని, దాని నివారణకు కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలు ఎకరాకు 10 కేజీల చొప్పున వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డీ అరుణ, కే అరుణ పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి బుజ్జిబాయి



దర్శి: మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణనాయక్

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

త్రిపురాంతకం: బైక్ అదుపు తప్పి జారిపడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అటుగా ప్రయాణిస్తున్న ఎంపీడీవో రాజ్‌కుమార్ వైద్యులకు సమాచారం అందించి వైద్యసేవలందేలా చేసి వినుకొండ వైద్యశాలకు తరలించారు. త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద గుంటూరు నుంచి మార్కాపురం వైపు బైక్‌పై వెళుతున్న శ్రీనివాసరెడ్డి అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్రంగా గాయమైంది. మార్కాపురం వైపు నుంచి త్రిపురాంతకం వస్తున్న స్థానిక ఎంపీడీవో రాజ్‌కుమార్ దూపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి బ్రహ్మతేజకు సమాచారం అందించి క్షతగాత్రునికి సకాలంలో వైద్య సిబ్బంది సేవలందించారు. మెరుగైన వైద్యం కోసం వినుకొండ వైద్యశాలకు తరలించారు. గ్రామసర్పంచ్ అనూష క్షతగాత్రుడిని పరామర్శించారు.



గాయపడిన వ్యక్తికి వైద్యసేవలందిస్తున్న వైద్యులు, పక్కన ఎంపీడీవో

ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసర్‌జీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసర్‌జీ

దర్శి: ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ దర్శి నియోజకవర్గ 16వ మహాసభలను స్థానిక పొట్టిశ్రీరాములు కళాశాలలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామాంజి అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభ ప్రారంభం సందర్భంగా పెద్దిరాజు జెండా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాసర్‌జీ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం విద్యార్థుల పోరాటాలతోనే సాధ్యమవుతుందన్నారు. దేశ స్వాతంత్ర్యంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని చెప్పారు. 89 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని పోరాటాలు చేస్తూనే ఉన్నామన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానాల వలన అనేక మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమవుతున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దర్శిలో పోరాటాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జీఓ నంబర్ 77 వలన ఉన్నత పీజీ విద్యకు దూరమవుతున్నారన్నారు. యువగళం యాత్రలో విద్యాశాఖామంత్రి నారాలోకేష్ జీఓ నంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చి మాటమీద నిలబడాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ పాఠశాలలకు సొంతభవనాలు లేక విద్యార్థులు అవస్థపడుతున్నారన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, కే హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, కే బాలయ్య, గొంగటి, స్టాలిన్, సురేంద్ర, అనిల్, జోయల్, చందు, శిరీష, అపర్ణ, సుధారాణి, సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నాగమయ్య స్వాముల తిరునాళ్లు



కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ: మండలంలోని దొనకొండ నుంచి చందవరం వెళ్లే ఏటి రాళ్ల గుట్ట వద్ద వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పెదన్నపాలెం చెరువుకట్ట వద్ద వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్లను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో నాగుల పంచమి సందర్భంగా తిరునాళ్లు జరుపుకోవడం ఆనవాయితీ కాగా, చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు చేసి స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజారి రెంటచింతల వెంకటేశ్వర్లు బృందం పూజలు చేశారు.

ఘనంగా కళ్యాణం...

తిరునాళ్ల సందర్భంగా శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణాన్ని పూజారి రెంటచింతల వెంకటేశ్వర్లు బృందం ఘనంగా జరిపించింది. గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణ, తదితర పూజలు చేశారు. కళ్యాణంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తిరునాళ్లకు విచ్చేసిన భక్తులకు రామిరెడ్డిపల్లెకు చెందిన రామిరెడ్డి వెంకట సతీష్‌రెడ్డి అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె.విజయ్‌కుమార్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఘనంగా శ్రీ రుద్రసహిత నవ చండీయాగం

దర్శి: పట్టణంలోని అంకాలమ్మ తల్లి ఆలయంలో శ్రీ రుద్రసహిత నవ చండీయాగాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక శుద్ధపంచమి అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రంలో దేవీ ఆరాధన, రుద్రాభిషేకం, శ్రీ చండీ సప్తశతి పారాయణం, శ్రీ నవచండీ యాగం నిర్వహించారు. శ్రీ అంకాలమ్మ, శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కర్నా రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని అంకాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ రుద్ర సహిత నవచండీ యాగంలో పాల్గొని పూజలు చేశారు. బూచేపల్లి వెంకాయమ్మను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. చండీయాగం కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని యాగాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. హాజరైన భక్తులు, మాలధారులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



చండీయాగంలో పాల్గొన్న భక్తులు



హోమ ద్రవ్యాలు సమర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ